


నారాయణగూడలో ఓటు ఫ్రమ్ హోమ్‌ను పరిశీలిస్తున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



జిల్లాలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న రొనాల్డ్ రాస్

# హోం ఓటింగ్@838 మంది

సిటీబ్యూరో, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఈనెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏండ్లు దాటిన వారితోపాటు పీడబ్ల్యూడీ ఓటర్లు ఇంటి వద్దనే ఓటేసే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. ఈ నేపథ్యంలో అర్హులైన వారు ఓటు వేసే అవకాశం కల్పించేందుకు ఫారం-12 డీని (పోస్టల్ బ్యాలెట్) పంపిణీ చేశారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 838 మంది ఓటర్లు తమ ఇంటి వద్దనే ఓటేసేందుకు అర్హులుగా సంబంధిత రిటర్నింగ్ అధికారులు గుర్తించారు. సోమవారం నుంచి హోమ్ ఓటింగ్ వేసేందుకు జిల్లా ఎన్నికల అధికారి చర్యలు తీసుకున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో మొత్తం 26 మంది హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఓటింగ్‌లో కూడా సాధారణ పోలింగ్ మాదిరిగానే ఓటింగ్ ఉంటుంది. జిల్లాలో మొత్తం 838 మందికి హోమ్ ఓటింగ్‌కు ఆర్వోల నుంచి పోస్టల్ బ్యాలెట్ వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ప్రకారంగా.. ఇంటింటికీ వెళ్లి ఓటు వేయించాలి. హైదరాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మంగళవారం హోమ్ ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. అర్హులు తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మొదటి సారి ఇంటింటికీ వెళ్లి ఓటు హక్కు కల్పిస్తారు. ఒకవేళ ఆ సమయంలో ఓటరు లేని పక్షంలో.. రెండోసారి ఓటరు సమయం తీసుకొని ఆ సమయం ప్రకారంగా వెళ్లి ఓటు వేయిస్తారు. ఈ హైదరాబాద్ జిల్లాలో మొత్తం 838 మంది హోం ఓటింగ్‌ను వినియోగించుకోనున్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలించిన రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పోలీస్, పీఓ పోలింగ్ అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో వీరికి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఆయా నియోజకవర్గాల్లో సెంటర్లను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ తెలిపారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను రొనాల్డ్‌రాస్ మంగళవారం పరిశీలించారు. కార్వాన్‌లోని గోల్కొం డ, చార్మినార్‌లోని మొఘల్‌పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్, బహదూర్‌పురలోని తాసీల్దార్ కార్యాలయం ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు కమిషనర్ పరిశీలించారు. సనత్‌నగర్, ముషీరాబాద్, అంబర్‌పేట, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను డిప్యూటీ డీఈఓ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు.

## పోలింగ్ డే బందోబస్తుపై ఫోకస్

సిటీబ్యూరో, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారాలకు తగిన బందోబస్తు కల్పిస్తూనే.. ఓటింగ్ రోజు తీసుకోవాల్సిన బందోబస్తు చర్యలపై ట్రై పోలీస్ కమిషనర్లు కసరత్తు మొదలు పెట్టారు. ఇప్పటికే బూత్ స్థాయిలో ఏర్పాటు చేయాల్సిన బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, బూత్ నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపునకు సంబంధించిన రూట్ మ్యాప్‌లు.. తదితర అంశాలపై ఉన్నతాధికారులు చర్చించి ప్రణాళికలు సిద్ధం చేశారు. పోలింగ్ డే దగ్గర పడుతుండటంతో ఇక పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేయాల్సిన బందోబస్తు, సున్నిత ప్రాంతాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు సిబ్బందిని సిద్ధం చేస్తున్నారు. 28వ తేదీ సాయంత్రానికి ప్రచార పర్వం పూర్తవుతోంది. ఆ తరువాత ఆయా రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశాలు ఉంటాయి. ఈ నేపథ్యంలోనే పటిష్ట నిఘాను ఏర్పాటు చేయాలని కింది స్థాయి సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రశాంత వాతావరణం, పటిష్ట బందోబస్తులో ఈ నెల 30వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసులు పూర్తిగా సిద్ధమయ్యారు.

## ఓట్ ఫ్రమ్ హోమ్

### పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనుదీప్

అంబర్‌పేట, నవంబర్ 21 : వృద్ధులు, దివ్యాంగులకు ఎలక్షన్ కమిషన్ ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించింది. అంబర్‌పేట నియోజకవర్గంలోని 236 పోలింగ్ కేంద్రాల పరిధిలో 51 మందికి ఇంటి నుంచి ఓటు వేసే వీలు కల్పించారు. ఎన్నికల సిబ్బంది 80 ప్లస్ వయస్సున్న వారి ఇంటికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్లను అందజేశారు. దీన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రిటర్నింగ్ అధికారి అప్పర్ణ, ఏఆర్ఓ మారుతీ దివాకర్, డిప్యూటీ కలెక్టర్ అశోక్‌రెడ్డి, పోస్టల్ బ్యాలెట్ ఇన్‌చార్జి రజిత తదితరులు పరిశీలించారు. బుధవారం కూడా ఈ అవకాశం ఉంది.

**పోలీసుల పోస్టల్ బ్యాలెట్‌ను కూడా..**

అంబర్‌పేటలో ఉన్న పోలీసు కుటుంబాలకు కూడా మంగళవారం పోస్టల్ బ్యాలెట్‌ను నిర్వహించారు. మొత్తం 587 ఓట్లు ఉన్నాయి. సీపీఎల్‌లో ఉన్న పోలీసు క్లబ్ హౌస్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. బుధవారం కూడా ఈ అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ఆర్వో అప్పర్ణ, ఏఆర్ఓ మారుతీ దివాకర్, డిప్యూటీ కలెక్టర్ అశోక్‌రెడ్డి, పీఓ రజిత, కాచిగూడ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## రూ.25 లక్షలు పట్టివేత

అబిడ్స్, నవంబర్ 21: ఎన్నికల్లో భాగంగా పోలీసులు తనిఖీలు చేస్తుండగా రూ.25 లక్షల నగదు పట్టుబడింది. గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వద్ద మంగళవారం సాయంత్రం షాహినాయత్‌గంజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నాంపల్లి ఫ్లవర్ మార్కెట్ వ్యాపారి అక్షయ్ జైన్ ద్విచక్ర వాహనంలో రూ.25 లక్షలు తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్, అడ్మిన్ ఎస్ఐ లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయం

అబిడ్స్, నవంబర్ 21: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి చెక్కు చెదరని ఆదరణ ఉన్నదని, ప్రజల సహకారంతో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం, హ్యాట్రిక్ సాధించడం ఖాయమని రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్, గోషామహల్ ఎన్నికల ఇన్‌చార్జి కోలేటి దామోదర్ గుప్తా పేర్కొన్నారు. మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, మల్లన్న గుట్ట ప్రాంతాలలో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, పార్టీ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ సతీమణి ఉమాదేవి వ్యాస్, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం కోలేటి దామోదర్ మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేండ్లుగా గోషామహల్ నియోజకవర్గంలో అభివృద్ధి నిలిచిపోయిందని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధికి పాటు పడ్తారన్నారు. అదే విధంగా.. మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వ్యాస్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని కోట్లది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులను చేపడ్తానని హామీనివ్వడం జరిగిందన్నారు. ఉన్నత హోదాలో ఉన్న మంత్రి కేటీఆర్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించడంతో నియోజకవర్గం ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్. ఆనంద్‌సింగ్, చంద్రశేఖర్‌రెడ్డి, శశిరాజ్ సింగ్, బుజ్జి, జి.శ్రీనివాస్ యాదవ్, శ్రీశైలం, రవికుమార్, అమిత్ కుమార్, సీహెచ్. ఆంజనేయులు, దినేశ్ సింగ్, రాకేశ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మంగళ్‌హాట్ డివిజన్ ఇందిరానగర్‌లో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, పార్టీ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ సతీమణి ఉమాదేవి వ్యాస్‌లతో కలిసి ప్రచారం చేస్తున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా



గన్‌ఫౌండ్రి బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్‌కుమార్, చిత్రంలో పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, బీఆర్ఎస్ ట్రేడ్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా తదితరులు..

## పార్టీలకు అతీతంగా గెలిపించుకుంటాం..

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్




సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

ఖైరతాబాద్, నవంబర్ 21 : అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా బీసీ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలందరూ ఒకే తాటిపైకి వచ్చారని, జెండాలు, అజెండాలను పక్కన పెట్టి బీసీలకు బాసటగా నిలబడుతామన్నారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ, నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, దుర్గయ్య గౌడ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్ కురుమ, సింగం నగేశ్ గౌడ్, మహేశ్ యాదవ్, భాస్కర్ మేరు, ఇంద్రం రజక, తారకేశ్వరి, శ్యామల, నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులకు ఆటంకం..

### కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు

జీడిమెట్ల, నవంబర్ 21: ఎన్నికల అధికారుల విధులకు ఆటంకం కల్పించిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తలపై జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ కథనం ప్రకారం.. కుత్బుల్లాపూర్ విలేజ్ వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచార సభను ఏర్పాటు చేశారు. ఎన్నికల వీడియో వింగ్ సర్వేలెన్స్ కుత్బుల్లాపూర్ వీడియో ఇన్‌చార్జి రమేశ్‌తో పాటు మరో సిబ్బంది సభ వద్దకు వెళ్లి వీడియో చిత్రీకరిస్తున్నారు. ఇది గమనించిన కాంగ్రెస్ పార్టీ నేతలు కెమెరాలను లాక్కొని.. అందులోని మెమోరీకార్డులు, సెల్‌ఫోన్లు లాక్కొని వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు సూచనల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధిత అధికారులు ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు శివయాదవ్, సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

### తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న భర్త

కుత్బుల్లాపూర్, నవంబర్ 21 : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా.. భర్త గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సుభాష్‌నగర్ భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన వై.రాధాకృష్ణారెడ్డి, అతడి భార్య వైష్ణవి(23) కలిసి మంగళవారం మధ్యాహ్నం తమ ద్విచక్ర వాహనంపై నిత్యావసర సరుకుల కోసం మార్కెట్‌కు వెళ్లి.. సరుకులు తీసుకొని తిరిగి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో భాగ్యలక్ష్మి కాలనీకి సమీపంలో వైర్‌గన్ మండి వద్ద యూటర్న్ తీసుకుంటుండగా.. వెనుకాల నుంచి దూసుకొచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వైష్ణవి తలకు బలమైన గాయం కావడంతో సమీపంలోని సృజన ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం సూరారం నారాయణ మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. రాధాకృష్ణారెడ్డి ఎడమ కాలు విరగడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు రాధాకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.